ఛాయా సోమేశ్వరాలయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పూజలు

ఆలయంలో అభిషేకం చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే , న్యాయమూర్తులు

రామగిరి, ఏప్రిల్ 27: జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ ఛాయా సోమేశ్వర ఆలయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధేతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు బి.విజయసేన్ రెడ్డి, టి.వినోద్‌కుమార్, కె.లక్ష్మణ్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజులు శనివారం సందర్శించారు. వీరికి ఆలయ కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ముక్కంటికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, ఆలయ అర్చకులు ఉదయ్‌కుమార్, అజయ్‌కుమార్, చెర్వుగట్టు పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు భరత్‌రెడ్డి, రవి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

శాలిగౌరారం : బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్

శాలిగౌరారం, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, జెరిపోతుల చంద్రమౌళిగౌడ్, గంట శంకర్, దుబ్బ వెంకన్న, పాక యాదయ్య, చిరబోయిన శ్రీనివాస్, దాసరి వెంకన్న, బట్ట వీరబాబు, చిపుట సైదులు, నథానియేల్, బోడ నర్సయ్య, బిళ్లకంటి శ్రీను పాల్గొన్నారు.

నాంపల్లిలో..

నాంపల్లి : మండలంలోని శుంకిశాల గ్రామంలో బీఆర్ఎస్ జెండాను మాజీ సర్పంచ్ బాషిపాక రాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాద లచ్చయ్య, ఎడమ మల్లేశ్, మద్ది నాగేశ్, పల్లపు శోభన్‌బాబు, కొత్తగొల్ల శ్రీరాములు, మద్ది సీనయ్య, బుడియపాక లక్ష్మయ్య, ఎల్లయ్య, భీమనపల్లి జంగయ్య, రాజు, దేవేందర్, కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

నందికొండలో..

నందికొండ : పైలాన్, హిల్‌కాలనీలో కౌన్సిలర్ రమేశ్‌జీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, నకిరేకంటి సైదులు, లక్ష్మణ్‌నాయక్, నజీర్, చారి, రామస్వామి, మహేశ్, వీరయ్య, శ్రీను, కొండలు, అలీ, ప్రసాద్, ఏసు పాల్గొన్నారు.

నాంపల్లి : శుంకిశాలలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ సర్పంచ్ రాములు

నందికొండ : బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న కౌన్సిలర్ రమేశ్‌జీ

నల్లగొండ : జనార్దన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ పార్టీని టచ్ చేస్తే సహించేది లేదు

- ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి తీసుకుంటున్నారు
- పోలీస్ అధికారులు పక్షపాత వైఖరిని విడనాడాలి
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. భారతదేశ చరిత్రలో ఏనాడు లేని విధంగా కేవలం నాలుగు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకున్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకత నుంచి బయట పడేందుకు పోలీస్ వ్యవస్థను పావులాగా వాడుకుంటున్నారని విమర్శించారు. నల్లగొండ జిల్లాలోని ఇద్దరు మంత్రులు అధికారాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు దుయ్యబట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ పక్షపాత వైఖరిని అవలంబించ లేదన్నారు. పోలీసులను ఉపయోగించుకుని అక్రమ కేసులను కార్యకర్తలపై బనాయించి భయభ్రాంతులకు గురిచేసి ఓట్లు వేయించుకోవాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నదని మండిపడ్డారు. 5 లక్షల మెజార్టీతో ఎంపీ ఎన్నికల్లో గెలుస్తామని చెప్పిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓటమి భయంతోనే జిల్లాలో బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ నాయకులను కొట్టడం, కనీసం వారి నుంచి ఫిర్యాదులు కూడా స్వీకరించకుండా తిరిగి వారిపైనే తప్పుడు కేసులు నమోదు చేస్తుండంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని సూచించారు. నల్లగొండ ఎంపీ ఎన్నికలకు ఇన్‌ఛార్జీగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే మెజార్టీ రాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారానికి వెళితే ఓటమి భయంతో అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. నాలుగు నెలలకే పోలీసులను విచ్చలవిడిగా వాడితే ఇంకా నాలుగున్నరేళ్ల పరిపాలనను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా కొనసాగిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల దాడులకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తల కోసం అధినేత కేసీఆర్ లీగల్‌సెల్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నల్లగొండ జిల్లాలో భారీ మెజార్టీతో ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలను నమ్మి మోసపోయిన ప్రజలు తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని గుర్తించినట్లు పేర్కొన్నారు.

జనార్దన్‌రావు కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నల్లగొండ, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సంధినేని జనార్దన్‌రావు కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య పరామర్శించారు. జనార్దన్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం ఆయన దశదిన కర్మను పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు జనార్దన్‌రావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు రాంచందర్ నాయక్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, పంకజ్ యాదవ్, బక్క పిచ్చయ్య, బకరం వెంకన్న, మైనం శ్రీనివాస్, నిరంజన్ వలీ, కరీం పాషా, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జయప్రద, స్వరూప పాల్గొన్నారు.

రోడ్ షోను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 27 : ఈ నెల 29న దేవరకొండ నియోజకవర్గంలోని డిండి, చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రోడ్ షో ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. శనివారం దేవరకొండలో విలేకరులతో మాట్లాడారు. రోడ్ షోలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హమీలతో ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ మోసాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్‌రావు, లోకసాని తిరుపతయ్య, మాజీ ఎంపీపీ ఏర్పుల గోవిందుయాదవ్, నాయకులు జనార్దన్‌రావు, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, ముక్కమల బాలయ్య, లోక్యానాయక్, ఆరెకంటి రాములు, మోహన్, రవీందర్, గోసుల శివ, వెంకటయ్య, ముత్యాల రవి, వడ్త్య బాలు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

దేవరకొండరూరల్ : మండలంలోని శేరిపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాజీ ఎమెల్యేను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంపీటీసీ రమావత్ నర్సింహ, నాయకులు చిన్న శ్రీను, యాదవాచారి, కొండల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పరామర్శ

వేములపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని శెట్టిపాలెం గ్రామ బీఆర్ఎస్ నాయకుడు మజ్జిగపు సుధాకర్‌రెడ్డి తండ్రి పెదలింగారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శనివారం గ్రామానికి వెళ్లి పెదలింగారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్టా మల్లేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, నక్క నాగరాజు, బంటు రాము ఉన్నారు.

బీఆర్ఎస్ కొట్టాల గ్రామశాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్

బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేశ్

మిర్యాలగూడ, ఏప్రిల్ 27 : మండలంలోని కొట్టాల గ్రామంలో శనివారం బీఆర్ఎస్ గ్రామశాఖను ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెర్లకంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గంట అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా జనగాం శేఖర్ గౌడ్, యూత్ అధ్యక్షుడిగా నెర్లకంటి శ్రీకాంత్, కార్యదర్శులుగా గంట కృష్ణ, నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా కంబాలపల్లి శంకర్, వీరేశ్, ఆంజనేయులు, సైదులు ఎన్నుకయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ శిక్షణ శిబిరం

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 27: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నుంచి వేసవి ఉచిత టేబుల్ టెన్నిస్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ కోచ్ ఆనంద్ బాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో 6 నుంచి 10 సంవత్సరాల పిల్లలకు 40 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్ నంబర్ : 9440734973, 9885731269ను సంప్రదించాలని సూచించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీ

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ

చిట్యాల, ఏప్రిల్ 27 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధాలనాలను అవలంబిస్తున్నదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం కట్టంగూర్‌లో నిర్వహించిన మేడే సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 8 గంటలకు బదులు 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను మోసం చేసిందన్నారు. మేడే వారోత్సవాలను ఘనంగా నిర్వహించాని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్‌గా పొడిచేటి సులోచన, కో కన్వీనర్లుగా గుడుగుంట్ల రామకృష్ణ, కట్ట బక్కయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు, గుడుగుంట్ల రామకృష్ణ, తవిటి వెంకటమ్మ, సులోచన, కంకణాల శోభరాణి, గద్దపాటి ఇస్తారి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

దవాఖానలో వార్డులను పరిశీలిస్తున్న డీసీఎచ్ మాతృనాయక్

నందికొండ, ఏప్రిల్ 13 : ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన వైద్యం అందించాలని డీసీఎచ్ మాతృనాయక్ ఆదేశించారు. నందికొండ హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా దవాఖానను శనివారం ఆయన సందర్శించారు. రోగుల వార్డులు, వారికందుతున్న వైద్యం, ఆహారం వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. దవాఖానకు వచ్చే వారికి అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఎంఒ భాను ప్రసాద్, డాక్టర్లు ఉన్నారు.

బీజేపీని ఓడించడమే బలహీన వర్గాల కర్తవ్యం

- డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న మారుపాక అనిల్‌కుమార్

మిర్యాలగూడ, ఏప్రిల్ 27: బలహీనవర్గాలకు బద్ధ శత్రువుగా నిలిచిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించమే ఆయా వర్గాల కర్తవ్యమని డీహెచ్‌పీఎస్(దళిత హక్కుల పోరాట సమితి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ, నిరంకుశ, మతతత్వ పాలన సాగించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల రక్తంతో రాసిన భారత రాజ్యాంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ కార్పొరేట్ శక్తుల కోసమే పని చేస్తున్నారని, మహిళలపై దాడులు, అఘాయిత్యాలు చేసేవారిని కాపాడుతుందని ఆరోపించారు. నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతున్నా పట్టించుకోకుండా దేశం అభివృద్ధి చెందుతుందంటూ ప్రజలను మభ్యపెడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కలిసి బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి డి.లింగానాయక్, నాయకులు ఎండీ.సైదా, జిల్లా యాదగిరి, జిల్లా సుధీర్, మారతమ్మ, రామలింగం, సైదులు, సుధాకర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా పోల్ స్లిప్పులు పంపిణీ చేయాలి

- ఏఈఆర్ఓ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ఏఈఆర్ఓ శ్రీనివాస్

నిడమనూరు, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోల్ స్లిప్పులను ఓటర్లకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏఈఆర్ఓ) జె.శ్రీనివాస్ బీఎల్ఓలకు ఆదేశించారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరుకు పోల్ స్లిప్ అందేలా బూత్ స్థాయి అధికారులు పంపిణీ చేపట్టాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో గందరగోళ పరిస్థితికి తావు లేకుండా ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలని సూచించారు. సమావేశంలో తాసీల్దార్లు జంగాల కృష్ణయ్య, జయశ్రీ, ప్రమీల, సరోజాపావని, నాయబ్ తాసీల్దార్ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు

రైతులతో మాట్లాడుతున్న సివిల్ సప్లయి డీఎం నాగేశ్వర్‌రావు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 27: ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ డీఎం నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. శనివారం మండలంలోని కొత్తపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో తూకం, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, రైతులకు నష్టం జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏపీఎం వినోద, సివిల్ సప్లయ్ ఆర్ఐ లింగస్వామి, సీసీలు ఉన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ఎన్నికల పరిశీలకులు

రామగిరి, ఏప్రిల్ 27: ఓటు హక్కుపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు మనోజ్ కుమార్ మానిక్‌రావ్ సూర్యవంశి శనివారం ఉదయం సందర్శించారు. ఓటర్లలో చైతన్యం కోసం ఇలాంటి ఫొటో ఎగ్జిబిషన్లు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఓటహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎన్. ప్రేమ్ కరణ్‌రెడ్డి, జిల్లా సమాచార, ప్రచార సంబంధాల శాఖ సహాయ సంచాలకుడు యు. వెంకటేశ్వర్లు, సీబీసీ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటి అధికారి కోటేశ్వర్‌రావు, ఐకేపీ డీపీఎం అరుణ్‌కుమార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యామ్, లైబ్రేరియన్ రాజారాం, భోదన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామిల్ దగ్ధం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలోని నాగార్జునసాగర్ రోడ్డులో గల లక్ష్మీ నర్సింహసామిల్ శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిల్లు యజమాని జగదీశ్వరాచారి శుక్రవారం రాత్రి 9 గంటలకు మిల్లుకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు లేచి సామిల్‌లోని కట్టెలకు అంటుకొన్నాయి. మిల్లులో మంటలు చెలరేగుతుండడంతో గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించారు.

దేవరకొండ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కట్టెమిషన్‌తో పాటు అక్కడ నిల్వ చేసిన టేకు కట్టెలు పూర్తిగా కాలిపోయాయి. దాంతో రూ.30 లక్షల పైనే నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

చెరువు మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఇరిగేషన్ డీఈ జనార్దన్

దామరచర్ల/వేములపల్లి, ఏప్రిల్ 27: అనుమతులు లేకుండా చెరువుల నుంచి మట్టిని తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ జనార్దన్ హెచ్చరించారు. శనివారం నమస్తే తెలంగాణాలో ప్రచురితమైన 'చెరువు మట్టి అక్రమ తరలింపు' వార్తపై ఆయన స్పందించారు. వేములపల్లి మండల కేంద్రంలోని చిన్న చెరువులో కోడిదల లింగయ్యకు చెందిన జేసీబీతో పుట్టల శ్రీను చెరువు శిఖంలోని మట్టితీసి విక్రయించుకున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. అతడిపై వేములపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శ్రీను చెరువు నుంచి 2700 క్యూబిక్ మీటర్ల మట్టి తరలించినట్లు నిర్ధారించామని, దాని విలువ లక్షరూపాయలు ఉంటుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు మట్టి తరలింపునకు దరఖాస్తు చేసుకోగా అనుమతి ఇచ్చామని చెప్పారు. కానీ రైతు ఎఫ్‌టీఎల్‌లో మట్టిని పోసి నింపుతున్నందున అనుమతులు రద్దు చేసినట్లు తెలిపారు. వారిపై కూడా వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలూనాయక్

మాల్, ఏప్రిల్ 27: చింతపల్లి మండలంలోని మదనాపురం శివారులో గల లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శనివారం జాతర సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆయన వెంట ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, జంగిటి నర్సింహ, శ్రీను, జటావత్ హరినాయక్, ఎం. యాదగిరి ఉన్నారు.

24 కిలోల గంజాయి పట్టివేత

కేతేపల్లి, ఏప్రిల్ 27 : వాహనంలో తరలిస్తున్న 24 కిలోల గంజాయిని శనివారం మండల పరిధిలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. స్థానిక ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనం నుంచి ముగ్గురు వ్యక్తులు దిగి చెట్ల పొదళ్ల వద్ద నుంచి అనుమానాస్పదంగా వెళ్లడాన్ని పోలీసులు గమనించారు. వారిని వెంబడించి పట్టుకున్నారు. వారు ముంబయిలోని థానేకు చెందిన ముస్కాబ్ అన్సారీ, పాలఘర్‌కు చెందిన షహనాజ్ ఇలియాజ్ ఖాదర్‌ఖాన్, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన చిత్తూనాయక్‌గా పోలీసులు గుర్తించారు. ఒక్కొక్కరి వద్ద రెండు చొప్పున మొత్తం ఆరు బ్యాగుల్లో రూ.6 లక్షల విలువైన 24 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సాకు చెందిన మనోజ్ అనే వ్యక్తి నుంచి ముంబైకు చెందిన మైకెల్‌కు చేరవేసేందుకు వీరు గంజాయి తీసుకెళ్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల్లో ఇద్దరు మహిళలున్నారు.ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శివతేజ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

చిట్యాల, ఏప్రిల్ 27 : ఈ నెల 21న తప్పిపోయిన చిట్యాలకు చెందిన భిక్షం(55) మృతదేహం శనివారం లభించినట్లు ఎస్ఐ డీ. సైదబాబు తెలిపారు. భిక్షం ఇంట్లోంచి వెళ్లిపోయి తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిట్యాలలోని వేణుగోపాల స్వామి వెంచర్‌లోని మురుగు కాల్వలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మున్సిపాలిటీ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతి చెందింది మేకల భిక్షంగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భిక్షం ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★Narketpally 'Y'Junction 4Hi-way Homes Housing Venture, Launching offer@7900/- Suprise Gifts & koyyalgudem 5 lac 1 Gunta 8522014420
NT-340428

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | చౌటుప్పల్: 9182777638